# నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- తట్టేపల్లి, అంతారంలలో పర్యటించిన వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్ సుధీర్
- గ్రామపంచాయతీ, పల్లె దవాఖాన భవన నిర్మాణ పనులు, అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతు పనుల పరిశీలన



పెద్దేముల్ : తట్టేపల్లిలో గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్ సుధీర్

పెద్దేముల్, ఆగస్టు 21 : గ్రామపంచాయతీ, పల్లె దవాఖాన, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ మరమ్మతుల నిర్మాణ పనుల్లో కచ్చితంగా నాణ్యతా ప్రమాణాలను పాటించాలని వికారాబాద్ జిల్లా ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్ సుధీర్ సూచించారు. బుధవారం మండల పరిధిలోని తట్టేపల్లి గ్రామంలో పర్యటించి నూతనంగా నిర్మిస్తున్న గ్రామపంచాయతీ, పల్లె దవాఖాన, వివిధ పాఠశాలల్లో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాల మరమ్మత్తుల పనులు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆయా పాఠశాలల పరిసరాలు, తరగతి గదులు, పారిశుధ్య పనులను అధికారుల బృందంతో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. తట్టేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9, 10వ తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో పాఠ్యపుస్తకాలను చదివించి పలు అంశాలపై విద్యార్థులను ప్రశ్నించారు. ముందుగా తనిఖీల్లో భాగంగా గ్రామపంచాయతీ, పల్లె దవాఖాన నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం తట్టేపల్లి ప్రాథమిక పాఠశాలలో మూత్రశాలలు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరుపై అసహనం వ్యక్తం చేశారు. తర్వాత హరిజన్‌వాడ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు.

అంతకుముందు ప్రాథమిక పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న హెల్త్ సబ్ సెంటర్‌ను పరిశీలించి గ్రామంలో ఫీవర్ సర్వే చేపడుతున్నారా?లేదా? ప్రజలకు మందులను అందుబాటులో ఉంచుతున్నారా? లేదా? గ్రామాల్లో పర్యటిస్తున్నారా? లేదా? అనే విషయాలను వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో నీటి ట్యాంక్‌ను క్రిందిభాగంలో పెట్టడంపై అసహనం వ్యక్తం చేస్తూ దానిని వెంటనే మార్చాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట తాండూరు డీఎల్పీవో శంకర్‌నాయక్, ఎంపీడీవో జర్నప్ప, ఎంపీవో రతన్‌సింగ్, పీఆర్ డీఈ, పీఆర్ ఏఈ, ఈసీ, వైద్య సిబ్బంది, హెచ్‌ఎంలు, ఏసీడీపీఓ లక్ష్మి, మాజీ ఎంపీటీసీ శంకర్, నాయకులు గోపాల్, నర్సింహులు, హన్మంతు, తట్టేపల్లి పీఏసీఎస్ వైస్ చైర్మన్ అంజయ్య పాల్గొన్నారు.

## అంతారంలో సీసీ రోడ్లు, పాఠశాల సందర్శన

**తాండూరు రూరల్ :** తాండూరు మండలం అంతారం గ్రామంలో రూ.8 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, మురుగు కాలువలను జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ పరిశీలించారు. అనంతరం పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో మూత్రశాలలరె పరిశుభ్రంగా పెట్టుకోవాలని సూచించారు. గదులపై పెరిగిపోయిన గట్టిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. అనంతరం పాఠశాలలోని ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఓ ఉపాధ్యాయుడు హాజరు రిజిస్టర్‌లో సంతకం ఎందుకు పెట్టలేదని హెచ్‌ఎంను ప్రశ్నించగా.. తరగతి గదిలో ఉన్నారని.. పక్షవాతం కారణంగా సంతకం పెట్టలేదని సమాధానం ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. విద్యార్థులకు భోజన వసతిపై ఆరా తీశారు. గ్రామంలో మురుగు కాలువ నిర్మాణం ఎక్కడి నుంచి ఎక్కడి వరకు నిర్మించారని ఏఈ నందినిరెడ్డిని ప్రశ్నించారు. సీసీ రోడ్లు పనులపై కూడా ఆరా తీశారు. ఆయన వెంట ఎంపీడీవో విశ్వప్రసాద్, డీఎల్‌పీవో, డీఈఈ, ఏఈ, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.



నవాబుపేట : మాజీ మంత్రి సబితారెడ్డి నివాసంలో ఆమెను కలిసిన నవాబుపేట బీఆర్ఎస్ నేతలు

# నేడు రుణమాఫీపై రైతులకు మద్దతుగా బీఆర్ఎస్ ధర్నా

## ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు



చేవెళ్లటౌన్ : చేవెళ్లలో ధర్నా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, కార్తీక్‌రెడ్డి

నవాబుపేట, ఆగస్టు 21 : రేపు చేవెళ్ల నియోజకవర్గకేంద్రంలో నిర్వహించే రైతు ధర్నాను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నవాబుపేట మండల నేతలు కార్యకర్తలను ఏకంచేస్తూ ఒక రోజు ముందే సన్నాహాలు చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిన రుణమాఫీ అసంపూర్తిగా ఉన్నదని, దానిని సంపూర్ణంగా చేయాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు చేవెళ్లలో నిర్వహించనున్న ధర్నాకు తామంతా సిద్ధమవుతున్నట్లు నేతలు అన్నారు. ఇందులో భాగంగా మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి సూచనలను తీసుకునేందుకు బుధవారం వారు ఆమె నివాసంలో కలిశారు.

### వదిలే ప్రసక్తి లేదు

#### మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



**కొడంగల్ :** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేవరకు వదిలే ప్రసక్తి లేదని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు గురువారం నియోజకవర్గ కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో చేపట్టే రైతు రుణ మాఫీ నిరసన కార్యక్రమంలో నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల్ మండలాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో పాటు పెద్దఎత్తున రైతులు పాల్గొని ముక్త కంఠంతో ప్రభుత్వాన్ని నిలదీద్దామని పిలుపునిచ్చారు. ఉదయం 9.30 గంటలకు నిరసన కార్యక్రమం ప్రారంభమవుతుందని, కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కదలి రావాలని ఆయన కోరారు.

### షరతులు లేకుండా మాఫీ చేయాలి

#### మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



**పరిగి :** ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ప్రభుత్వం రుణ మాఫీ సంపూర్ణంగా చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఉదయం 9.30 గంటలకు పరిగిలోని బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### హామీలన్నీ నెరవేర్చే వరకు పోరాడుతాం

#### మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్‌రెడ్డి



**తాండూరు :** గురువారం తాండూరు నియోజకవర్గం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తాండూరు పట్టణం ఇందిరాచౌక్ వద్ద 'రైతన్నకు బాసటగా ధర్నా' కార్యక్రమం చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ పార్టీ తాండూరు అసెంబ్లీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పంజుగుల రోహిత్ రెడ్డి బుధవారం నమస్తే తెలంగాణతో పేర్కొన్నారు. తాండూరు నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలతోపాటు రైతులు పెద్దసంఖ్యలో హాజరు కావాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకు ప్రజల తరపున నిలబడి పోరాడుతామన్నారు.



## అమ్మ ఆదర్శ పాఠశాలకు నిధులు మంజూరు

### వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, ఆగస్టు 21 : జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద పనులు ప్రారంభించబడిన 966 పాఠశాలల్లో 451 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీడీవోలు మండల స్పెషల్ ఆఫీసర్స్, స్క్రూటినీ ఆఫీసర్స్ ద్వారా పరిశీలన జరిగిన తర్వాత రూ.4,41,52,751 డైరెక్ట్‌గా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అకౌంట్లో జమ చేయబడ్డాయన్నారు. పాఠశాలలన్నింటికీ 25% నిధులు పనులు ప్రారంభించక ముందే మంజూరయ్యాయని, ప్రస్తుతం మిగిలిన 75% నిధులను కూడా బుధవారం మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.

## రైతులందరికీ రుణమాఫీ చేయాలి



కలెక్టర్ శశాంకకు వినతిపత్రమిస్తున్న భారతీయ కిసాన్ సంఘ్ నాయకులు

మొయినాబాద్, ఆగస్టు 21 : రైతులందరికీ రుణమాఫీ చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి రాజిరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సామ మాధవరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రంగారెడ్డి కలెక్టర్ శశాంకకు వినతిపత్రం అందించారు. రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పుడు రేషన్ కార్డు, కుటుంబ సభ్యులతో లింక్ పెట్టి అందరికీ మాఫీ చేయడం లేదని చెప్పారు. ఒక కుటుంబంలో తండ్రీ కొడుకులు రుణం తీసుకుంటే ఒకరికే మాఫీ వస్తున్నదని, మిగతావారికి రావడం లేదని తెలిపారు. అదేవిధంగా ఆధార్ లింకు లేదని, బ్యాంకు డేటా రాలేదని, పేర్లు తప్పుగా ఉన్నాయనే కారణాలతో చాలా మంది రైతులకు రుణమాఫీ చేయలేదన్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్‌ను విన్నవించామని వారు తెలిపారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా నాయకులు, మండల నాయకులు, గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తదితరులు

# అక్టోబర్ 20 వరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ

## వీడియో కాన్ఫరెన్స్‌లో వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, ఆగస్టు 21 : జిల్లాలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, వచ్చే జనవరి 6న తుది ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి జిల్లా అదనపు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై సమీక్షించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వివరిస్తూ.. ఈ నెల 20 నుంచి అక్టోబర్ 18 వరకు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం నిర్వహించబడుతుందని, ఇంటింటా సర్వేతో బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి పరిశీలించి కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పు, తప్పులు సవరణ వంటి పనులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఒకే చిరునామాపై ఎక్కువ ఓట్లు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. అక్టోబర్ 29న ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించడం జరుగుతుందన్నారు. వీటిపై సవరణలు, అభ్యంతరాలకు నవంబర్ 28 వరకు స్వీకరిస్తారని, డిసెంబర్ 24 లోపు పరిష్కరిస్తారని తెలిపారు. వచ్చే జనవరి 6న తుది ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందని ఆయన వివరించారు.

### ఇంటింటి సర్వే చాలా ముఖ్యం

ఓటరు జాబితా రూపకల్పనలో ఇంటింటి సర్వే చాలా ముఖ్యమని, ఇ.ఆర్.ఓ., ఏఈఆర్, సూపర్‌వైజర్ల పర్యవేక్షణలో బూత్ లెవల్ ఆఫీసర్లు ఇంటింటి సర్వే చేపడతారని, ఇందుకోసం నియోజకవర్గ స్థాయిలో మాస్టర్ ట్రైనర్స్ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. బూత్ లెవల్ ఆఫీసర్ వద్ద ఎలక్టోరల్ జాబితా, పోలింగ్ స్టేషన్ మ్యాప్, వీఐపీ ఓటర్ల వివరాలు ఉండేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బూత్ లెవల్ ఆఫీసర్లు తమకున్న బి.ఎల్.ఓ. యాప్‌లో ఓటర్ల వివరాలను నమోదు చేయడం జరుగుతుందని, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి వారి సూచనలు, అభిప్రాయాలను స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఓటు హక్కు నమోదు కోసం 18 సంవత్సరాలు నిండబోయే యువత వివరాలను బూత్ లెవల్ అధికారుల ద్వారా ముందుగానే సేకరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్డీవో వాసుచంద్ర, జిల్లాస్థాయి, అసెంబ్లీ స్థాయి, మాస్టర్ ట్రైనర్స్, ఎన్నికల విభాగం పూపరింటెండెంట్ నేమత్ అలీ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## లా కోర్సుల రీవాల్యుయేషన్ దరఖాస్తుల గడువు పొడిగింపు

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 21: ఓయూ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్ దరఖాస్తుల గడువు పొడిగించినట్లు ప్రొఫెసర్ రాములు తెలిపారు. మూడేండ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్ కోర్సుల ఆరో సెమిస్టర్ రెగ్యులర్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకాం, ఎల్ఎల్‌బీ కోర్సుల పదో సెమిస్టర్ రెగ్యులర్ ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని, ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి ఈ నెల 17వరకు స్వీకరించినట్లు చెప్పారు. రూ.200 అపరాధ రుసుముతో 23 వరకు స్వీకరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



సమస్యలు పరిష్కరించాలని ధర్నా చేస్తున్న గెస్ట్ లెక్చరర్లు

## గెస్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలి

వికారాబాద్, ఆగస్టు 21 : ఇంటర్‌మీడియట్ కళాశాలలో దాదాపు పదేండ్లుగా పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలని అధ్యాపకులు తెలిపారు. బుధవారం వికారాబాద్‌లోని ప్రొ.జయశంకర్ విగ్రహం వద్ద నిరసన, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పది సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామన్నారు. ఎంతోమంది విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో గెస్ట్ లెక్చరర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, రూ.42వేల వేతనమిచ్చి 12 నెలల పాటు రెన్యూవల్ కల్పిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

## దరఖాస్తుల పరిశీలనను సకాలంలో పూర్తిచేయాలి

రంగారెడ్డి, ఆగస్టు 21(నమస్తే తెలంగాణ) : ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ శశాంక అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఇరిగేషన్ అధికారులతో ఎల్ఆర్ఎస్-2020 సర్వేపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి 2,37,259 దరఖాస్తులు రాగా, అందులో 1,96,154 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం దరఖాస్తులను పరిశీలించాలన్నారు. ఎల్ఆర్ఎస్ అప్లికేషన్ ప్రక్రియను సరళీకృతం చేయడానికి, క్రమబద్ధీకరించడానికి సీజీజీ ద్వారా పారదర్శక ఆన్‌లైన్ విధానాన్ని రూపొందించాలన్నారు. ప్రభుత్వ భూములు మొదలైన వాటిలో ప్లాట్లు, లేఅవుట్ల క్రమబద్ధీకరణ మార్గదర్శకాలపైన మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులు సమష్టిగా కార్యాచరణ రూపొందించుకుని పనిచేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డీపీవో సురేశ్ మోహన్, ఆర్డీవోలు సూరజ్‌కుమార్, అనంతరెడ్డి, వెంకట్‌రెడ్డి, సాయిరాం, వేణుమాధవ్, ఇరిగేషన్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ఓయూ పీజీ పరీక్షలు వాయిదా

ఓయూ, ఆగస్టు 21: ఓయూ పరిధిలోని అన్ని పీజీ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ.రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ, ఎంఏ, ఎమ్‌కాం, ఎంకాం(ఐఎస్), ఎంఎస్‌డబ్ల్యూ, ఎంలిబ్ఐఎస్సీ, ఎంజేఅండ్ఎంసీ తదితర కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలను వచ్చే నెల 4 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించినప్పటికీ, యూజీసీ నెట్, టీజీ - సెట్ పరీక్షల నేపథ్యంలో వాటిని వాయిదా వేసినట్లు చెప్పారు. పరీక్షలు తిరిగి నిర్వహించే తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు.

# ప్రసవాల సంఖ్య పెంచాలి

## డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

షాద్‌నగర్‌టౌన్, ఆగస్టు 21 : ప్రభుత్వ దవాఖానలో ప్రసవాల సంఖ్య పెంచాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. షాద్‌నగర్ డివిజన్‌లోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, డీఈవోలు, ఏఎన్ఎంలతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. గర్భవతులకు సంబంధించిన వివరాలను త్వరితంగా రిజిస్ట్రేషన్ చేయడంతోపాటు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసిన వెంటనే టీటీ వ్యాక్సిన్ ఇవ్వడంతోపాటు నెలకు సరిపోయే ఐరన్, ఫోలిక్ మాత్రలను ఇవ్వాలన్నారు. గర్భవతులు ఎనిమియా వ్యాధికి గురికాకుండా చూసుకోవాల్సిన బాధ్యత వైద్యాధికారులు, ఏఎన్ఎంలపై ఉందన్నారు. ప్రతి శనివారం సంవత్సరంలోని పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలను తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులను గుర్తించి వారికి నెలకు సరిపడా మందులను పంపిణీ చేయాలన్నారు. షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులు ప్రతి నెల పరీక్షలు తప్పకుండా చేయించుకునేలా చూడడంతోపాటు తగిన మందులను అందజేయాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మెడికల్ క్యాంప్‌లను నిర్వహించాలని ఆమె తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యాధికారులు, హెల్త్ సూపర్‌వైజర్లు, డీఈవోలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



వ్యవసాయ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

# చేతగాని ప్రభుత్వం గద్దె దిగాలి

## భారతీయ కిసాన్ సంఘ్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మల్లేశం

వికారాబాద్, ఆగస్టు 21 : ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేని ప్రభుత్వం గద్దె దిగాలని భారతీయ కిసాన్ సంఘ్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మల్లేశం అన్నారు. బుధవారం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రుణమాఫీ కాని రైతులు వికారాబాద్ మండల వ్యవసాయాధికారి కార్యాలయంలోని అధికారికి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయంలోని తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రూ.2లక్షల రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు మాట నిలబెట్టుకోలేదన్నారు. పట్టా పాసుబుక్కుల ఆధారంగానే రుణాలు ఇచ్చారే తప్పా.. రేషన్ కార్డు ఆధారంగా రుణాలు ఇవ్వలేదన్నారు. రూ.2లక్షల రుణ మాఫీకి బోలెడు కొర్రీలు అవసరమా అని ప్రశ్నించారు. ఎలాంటి కొర్రీలు లేకుండా రైతులందరికీ రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రుణ మాఫీ చేయకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, రుణమాఫీ కాని రైతులు భుజంగారెడ్డి, రాజు, పురుషోత్తంరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కరుణాకరరెడ్డి పాల్గొన్నారు.

### ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి




నాకు 10 ఎకరాల భూమి ఉన్నది. నవంబర్‌లో మర్పల్లి సొసైటీ బ్యాంకులో రూ.1.60 లక్షలు రుణం తీసుకున్నా. మూడో విడతలో రుణ మాఫీ అవుతుందని అనుకున్నా. రుణ మాఫీ కాకపోవడంతో బ్యాంక్ అధికారులను అడగగా వస్తాయంటూ మాట దాటవేస్తున్నారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం రుణ మాఫీ చేయాలి. రూ.2లక్షలలోపు ఉన్న నాకు రుణ మాఫీ ఎందుకు కాదు. అన్ని విధాలుగా సరైన పత్రాలున్నా రుణ మాఫీ కాలేదు. ప్రభుత్వం స్పందించి రుణ మాఫీ కాని రైతులకు రుణ మాఫీ చేయాలి.

**- పట్లోళ్ల బలవంత్ రెడ్డి, కొత్లాపూర్, మర్పల్లి**

# ప్రభుత్వ భూములు కబ్జాచేస్తే ఉపేక్షించవద్దు

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- పలు శాఖల అధికారులతో క్యాంపు కార్యాలయంలో సమీక్షా సమావేశం



అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 21 : నియోజకవర్గంలో ప్రభుత్వ భూములతో పాటు చెరువులు, కుంటలు కబ్జా చేస్తే ఉపేక్షించవద్దని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధికారులను ఆదేశించారు. ఈమేరకు బుధవారం ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయంలో మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్‌తో పాటు వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ప్రభుత్వ, అసైన్డ్, సీలింగ్ భూములు కబ్జాలకు గురవుతున్నాయని, వాటిని కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులు తీసుకోవాలన్నారు. నియోజకవర్గంలో చెరువులు, కుంటలు కూడా కబ్జాకు గురవడంతో పాటు ఎఫ్‌టీఎల్ పరిధిలో కూడా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, అలాంటివాటిని వెంటనే గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. నాలుగు మున్సిపాలిటీల్లో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ వేగవంతం చేయాలని, ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నవారందరిని విచారించి, వాటిని క్రమబద్ధీకరించాలని ఆయన అధికారులను ఆదేశించారు. చెరువులు, కుంటల మరమ్మతులకు చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రతిపాదనలు పంపాలని ఆయన ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. రోడ్ల మరమ్మతుకు తీసుకోవాల్సిన పనులపై ప్రతిపాదనలు ఇవ్వాలన్నారు. ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుకు కూడా ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని నోముల ఆగాపల్లితో పాటు అనేక మరమ్మతులకు నోచని రోడ్ల మరమ్మతుకు నిధులు కేటాయించామని, వాటి పనులు వెంటనే ప్రారంభించాలని పంచాయతీరాజ్ అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో అనంతరెడ్డి, మున్సిపల్ కమిషనర్లు అమరేందర్‌రెడ్డి, బాలకృష్ణ, రవీంద్రసాగర్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, అబ్బాస్, ఇబ్రహీంపట్నం తహసీల్దార్ సునీత, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు పాల్గొన్నారు.



మర్పల్లి యూనియన్ బ్యాంకులో రైతుల రద్దీ

## రైతుల ప్రదక్షిణలు

మర్పల్లి, అగస్టు 21 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఎలాంటి నిబంధనలు లేకుండా రూ.2 లక్షలు రైతుల పంట రుణాలు మాఫీ చేస్తామని చెప్పి 3 విడతలుగా విడుదల చేశారన్నారు. కానీ రుణ మాఫీ చేసినదాంట్లో మండలంలో 50 శాతం మంది రైతులకు కూడా మాఫీ కాలేదని పలువురు పేర్కొంటున్నారు. మాఫీ రాని రైతులు వ్యవసాయ కార్యాలయం, ఆయా గ్రామాలకు చెందిన క్లస్టర్లలోని రైతు వేదికల చుట్టూ తిరుగుతున్నారు. బ్యాంకుల్లోని స్టేట్‌మెంట్ గురించి, అలాగే పంట రుణాలు రుణమాఫీ అయిన వారితో బ్యాంకులు కిక్కిరిసి పోయాయి.